తిమ్మాపురంలో కనీస వసతులు కరువు

- తాగేందుకు ఫ్లోరైడ్ నీరే దిక్కు..
- అధ్వానంగా పారిశుద్ధ్యం
- రోగాల బారిన గ్రామస్తులు
- తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్

వీరులపాడు: మండలంలోని చెన్నారావుపాలెం పంచాయతీ శివారు గ్రామమైన తిమ్మాపురం ప్రజలు కనీస వసతులు కూడా లేక అవస్థలుపడుతున్నారు. తాగునీటి వసతి లేకపోవడంతో, ఫ్లోరైడ్ నీటినే తాగుతూ రోగాల బారినపడుతున్నారు. ఈ గ్రామంలో 320మంది జనాభా ఉండగా, అత్యధికులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. తాగేందుకు గుక్కెడు మంచినీరు లేకపోగా, గ్రామంలో సరైన రోడ్డు వసతి కూడా లేదు. డ్రైనేజీ సదుపాయం సంగతి సరేసరి. ఇలా కనీస వసతులకు నోచుకోక తిమ్మాపురం గ్రామస్తుల పాట్లు అన్నీఇన్నీ కావు. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడంతో తమ ఆవేదన అంతా అరణ్యరోదనగానే మారిందని గ్రామస్తులు వాపోతున్నారు.


గ్రామంలో శిథిలావస్థకు చేరిన మంచినీటి ట్యాంకు

ఫ్లోరైడ్ నీరే గతి..

వర్షాలు సకాలంలో పడితే తిమ్మాపురం గ్రామస్తులు వ్యవసాయ పనులే జీవనాధారంగా ఉంటాయి. వ్యవసాయ పనులు లేని సమయంలో పక్కనే కూతవేటు దూరంలో ఉండే కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌కు వెళ్లి కట్టెలు కొట్టుకుంటూ వచ్చే సంపాదనతో జీవనం సాగిస్తుంటారు. అయితే తిమ్మాపురం గ్రామానికి రక్షిత మంచినీటి సరఫరా చేయడంలో అధికారులు పూర్తిగా విఫలం కావడంతో గ్రామస్తులకు ఫ్లోరైడ్ నీరే దిక్కైంది. 2006లో గూడెంమాధవరం నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసి మూడేళ్లపాటు రక్షిత మంచినీటిని సరఫరా చేసినప్పటికీ పైపులైన్లు పగిలిపోతున్నాయనే నెపంతో ఆ తర్వాత నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో 20ఏళ్లుగా గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా లేక బోరు నుంచి వచ్చే ఫ్లోరైడ్ నీటినే తాగుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కిడ్నీ సమస్యలతో అవస్థలు..

బోరు పంపులో వచ్చే ఫ్లోరైడ్ నీటిని తాగుతున్న కారణంగా గ్రామస్తులు రోగాల భారిన పడుతున్నారు. ముఖ్యంగా గ్రామంలోని మెజార్టీ శాతం మంది ప్రజలకు కిడ్నీల్లో రాళ్లు, మోకాళ్ల నొప్పులు, దంత సమస్యలతో అల్లాడుతున్నారు. చిన్నారులు సైతం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ఈసమస్యలను పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా లాభం లేకుండాపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు.


తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన బోరు


జనావాసాల మధ్యన నిలిచిన మురుగు

అధ్వానంగా పారిశుద్ధ్య పరిస్థితి..

గ్రామంలో డ్రైన్‌లు సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు, ఇళ్లలోని వాడుక నీరు పారుదల సజావుగా సాగక ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. రోడ్లు వెంబడి, ఖాళీస్థలాల్లో మురుగు నిలుస్తూ దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల కారణంగా విష జ్వరాలు ప్రబలుతున్నాయని తిమ్మాపురం గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామంలో నెలకొన్న తాగునీరు, అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని తిమ్మాపురం వాసులు కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బంది...


మా గ్రామానికి రక్షిత మంచి నీరు సరఫరా కావటం లేదు. ఏళ్ల తరబడి బోరు పంపులోని ఫ్లోరైడ్ నీటినే తాగుతుండటతో మోకాళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలతో ఇబ్బందిపడుతున్నాం.
– వెంకట నరసమ్మ, గ్రామస్తురాలు

దోమల బెడద అధికం..


మాగ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటంతో ఇళ్లలోని వాడుక నీరు, వర్షపు నీరు పారుదల కావడం లేదు. మురుగు కారణంగా దోమలు వృద్ధిచెందుతూ రోగాల బారినపడుతున్నాం.
– అప్పారావు, గ్రామస్తుడు

వైద్యసేవలు అందడం లేదు..


ఫ్లోరైడ్ నీటిని తాగుతుండటంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు. అధికారులు గ్రామంలో వైద్యశిబిరాలు కూడా నిర్వహించడం లేదు.
– సత్యనారాయణ, గ్రామస్తులు

మౌలిక వసతులు కల్పించాలి..


గ్రామంలో తాగునీరు లేక మురుగునీరు పారుదలగాక, రహదారులు లేక అవస్థలు పడుతున్నాం. పట్టించుకుని వారే కరువయ్యారు. అధికారులు స్పందించి మౌలికవసతులు కల్పించాలి.
– వెంకట నరసయ్య, గ్రామస్తుడు

క్లుప్తంగా

రూ.1.73 లక్షల ఆదాయం

నందిగామ రూరల్: వ్యవసాయ భూముల టెండర్ కం బహిరంగ కౌలు వేలం పాటల ద్వారా లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారికి రూ. 1.73 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో నరసింహమూర్తి తెలిపారు. లింగాలపాడులోని లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారి ఆలయ ఆవరణలో గురువారం ఆలయానికి చెందిన వ్యవసాయ భూములకు కౌలు వేలం నిర్వహించారు. తక్కెళ్లపాడు, లింగాలపాడు గ్రామ శివారులోని 28.98 ఎకరాలకు కౌలు వేలం పాటలు నిర్వహించగా రూ.1.73లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలగిరి ఈవోగా సాంబశివరావు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): తిరుమలగిరి ఆలయ ఈవోగా ఎస్వీ సాంబశివరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితో పాటు ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి వారి మనోభావాలు దెబ్బతినకుండా అన్ని చర్యలు తీసుకుంటానని తెలిపారు. స్వామి వారి ప్రసాదాల నాణ్యత, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా ఈవోకు ఆలయ చైర్మన్ భరద్వాజ్, ప్రధానార్చకుడు రామకృష్ణమాచార్యులు అభినందనలు తెలియజేశారు.

50 శాతం మంది విద్యార్థులు హాజరు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం నేపథ్యంలో గురువారం మండలంలోని ఆయా పాఠశాలల్లో 50 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో చిట్టిబాబు తెలిపారు. ఉపాధ్యాయులు కూడా నూరు శాతం హాజరయ్యారన్నారు. అదే విధంగా విద్యా కిట్లను 20 శాతం మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

బాబా సన్నిధిలో సినీనటుడు సుమన్



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీభగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రముఖ సినీనటుడు సుమన్ బాబావారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మందిరంలోని శ్రీవేంకటేశ్వర స్వామివారికి స్వయంగా పూజలు చేసి హారతులు ఇచ్చారు. ఆలయ గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎన్ రాజు, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలు, కోలాట నృత్యాలతో సుమన్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన బాబా, కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ చైర్మన్, ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వైవీ శివాజీ, ఎం బాలవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మేరీమాత ఆలయ ప్రతిష్టా మహోత్సవం

నందిగామరూరల్: మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పరిశుద్ధ లూర్దుమేరీ మాత ఆలయ ప్రతిష్టా మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

నందిగామటౌన్: కాకతీయ విద్యాసంస్థల 40వ వార్షికోత్సవాన్ని పాఠశాల ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆసంస్థ చైర్మన్ కాపా రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కాపా భారతి, హెచ్ఎం వీరరాఘవులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ విద్యార్థులకు గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాకిట్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పాఠశాల హెచ్ఎం పారేపల్లి నాగేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల విభాగం హెచ్ఎం జి.నిక్సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాచేటి వాగుపై ఆక్రమణలు తొలగించరూ..


కంచికచర్లలో ఇన్‌చార్జి తహసీల్దార్ మానసకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కంచికచర్ల : పరిటాల రాతి క్వారీల సమీపంలో కొంతమంది క్వారీ నిర్వాహకులు కాచేటి వాగును ఆక్రమించుకుని రోడ్డు వేశారని, వర్షాకాలంలో వరద నీరు పారుదలగాక ఈప్రాంతంలోని పంట పొలాలన్నీ వరద ముంపుకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు వారు గురువారం కంచికచర్ల ఇన్‌చార్జి తహసీల్దార్ వి.మానస, నందిగామ ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా పరిటాల గ్రామానికి చెందిన బోడెపూడి వెంకటరామారావుతోపాటు పలువురు రైతులు మాట్లాడుతూ పరిటాల శివారు దొనబండ రాతి క్వారీల వద్ద సర్వే నెంబర్ 311, 326, 327 నంబర్లలో ప్రధానమైన కాచేటి వాగు ఉందని ఆవాగు ద్వారా పొలాల్లో నిల్వ ఉన్న నీరంతా బయటకు వెళ్తుందన్నారు. అయితే కొంతమంది క్వారీ నిర్వాహకులు ఆ కాచేటి వాగును పూడ్చివేసి రోడ్డు వేయడంతో భారీ లారీలు కంకర లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. దీంతో వాగంతా ఆక్రమణకు గురై వర్షాకాలంలో వర్షపు నీరు వెళ్లే మార్గంలేక పంటపొలాలన్నీ నీట మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాచేటి వాసు సమీపంలోని రైతులు సాగుచేసిన పంటలన్నీ వరదనీటిలో తేలియాడుతున్నాయన్నారు. అధికారులు ఇప్పటికైనా కాచేటి వాగుపై ఆక్రమణలను తొలగించి పంటపొలాలను కాపాడాలని కోరారు.

అన్న ప్రసాద తయారీ కేంద్రంలో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన అన్న ప్రసాద తయారీ కేంద్రంలో ఈవో శీనానాయక్ గురువారం తనిఖీలు నిర్వహించారు. కనకదుర్గనగర్ సమీపంలోని అన్నప్రసాద తయారీ కేంద్రానికి చేరుకున్న ఈవో శీనానాయక్ గేట్ సెక్యూరిటీ వద్ద నమోదు చేసుకున్న వివరాలను పరిశీలించారు. అన్నదానానికి ఎన్ని గిన్నెల అన్నం, కూరలు, ఇతర వంటకాలను పంపారని ఆలయ సిబ్బందితో పాటు సెక్యూరిటీ సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం అన్న ప్రసాద తయారీకి ఉపయోగించే సరుకుల నిల్వ, రికార్డు బుక్‌లను సరిచూశారు. స్టాక్ రికార్డుకు, నిల్వకు కొంత వ్యత్యాసం ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గది పరిశుభ్రంగా లేకపోవడం, ఆహార పదార్థాల నిల్వల్లో వ్యత్యాసాలు ఉండటంతో నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.


గోడౌన్‌లో స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఈవో

17న మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 17 మంగళవారం ఉదయం 10గంటల నుంచి ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో బీఎం విజయలక్ష్మీ గురువారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, సంబంధిత అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో పొక్లెయిన్ దగ్ధం



కంచికచర్ల: షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ పొక్లెయిన్ దగ్ధమైన ఘటన గురువారం కంచికచర్లలో చోటుచేసుకుంది. ఫైర్ అధికారి శివారెడ్డి కథనం మేరకు మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన మాగంటి బాలకృష్ణకు చెందిన పొక్లెయిన్‌ను కంచిలమ్మ చెరువులో పూడిక తీత పనులకు వినియోగిస్తున్నారు. ఈక్రమంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా పొక్లెయిన్ నుంచి మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.4లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు ఫైర్ అధికారి శివారెడ్డి తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు సురేష్‌కు నివాళి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యానాల సురేష్(45) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. మృతుడు సురేష్‌కు భార్య, కుమార్తె కలరు. ఆయన మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఏలూరి శివాజీ, మండల పార్టీ అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి సురేష్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. సురేష్‌కు నివాళులర్పించిన వారిలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు గ్రామసర్పంచ్‌లు బి.జ్యోతిబ్రహ్మం, వేల్పుల పద్మకుమారి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, జగ్గయ్యపేట పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్ ఉన్నారు.


సురేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు, నాగమణి, గాంధీ తదితరులు

విద్యతోనే సమాజాభివృద్ధి


విద్యా కిట్లు అందిస్తున్న జెడ్పీటీసీ నాగమణి, ఎంపీపీ గాంధీ, సర్పంచ్ పద్మకుమారి, హెచ్ఎం బాబూరావు

పెనుగంచిప్రోలు: ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. గ్రామంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీతో పాటు ఎంపీపీ మార్కపూడి గాంధీ, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా అంకితభావంతో విద్యను అందించాలన్నారు. పొరుగు గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే బాలికలకు ఆటో సౌకర్యం కల్పించటం జరుగుతుందని దాత స్వామి గోపాలరావు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం నక్కా బాబూరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జంగం బుద్ధవేమన, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అంగనవాడీ పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా చిల్లకల్లులోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు పలకలు, బలపం, మిఠాయిలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజనీజ్వాల, సువర్ణ, అంగనవాడీ కార్యకర్తలు లక్ష్మీకాంతం, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను అందంగా ముస్తాబు చేశారు. చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. వత్సవాయిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీబీజాన్ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజనీజ్వాల ఆధ్వర్యంలో 12,14వ వార్డుల్లోని అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పిల్లలకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేశారు. సూపర్‌వైజర్ రజనీజ్వాల మాట్లాడుతూ మూడునుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటల ద్వారా విద్యనందిస్తున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.లక్ష్మీకాంతమ్మ, అనంతలక్ష్మి, దుడకా సీతామహాలక్ష్మి, షేక్ సఫియా, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.


చిల్లకల్లులో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


వత్సవాయిలో చిన్నారిచే అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచ్ భూక్యా సీతమ్మ

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మండలంలోని పెండ్యాల సెక్టార్ పరిధిలోని కీసర, గండేపల్లి, వేములపల్లి, ఎస్.అమరవరం, మోగులూరు, పేరకలపాడు, మున్నలూరు, కునికెనపాడు, చెవిటికల్లు గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాల్లో చిన్నారులకు గురువారం అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ కరీమాబీ మాట్లాడుతూ మూడు ఏళ్లు నిండిన పిల్లలందరిని అంగనవాడి ప్రీ స్కూల్‌లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగనవాడి కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామ రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాలలో గురువారం సీడీపీవో లక్ష్మీభార్గవి ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగనవాడీ కేంద్రాలలో అక్షరాభ్యాసాలు చేయించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ ఖాలిక్, మారం అమరయ్య, సూపర్‌వైజర్‌లు కరుణకుమారి, తారాభి, వెంకట్రావమ్మ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


జగ్గయ్యపేటలో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చందర్లపాడు మండంలో..

చందర్లపాడు(నందిగామటౌన్): అంగనవాడీ కేంద్రాల్లో అందించే సేవలను తల్లులు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని అంగనవాడీ సూపర్‌వైజర్ ఎస్‌కె ఇష్రత్ సూచించారు. చందర్లపాడు మండలం కోనాయపాలెం, గుడిమెట్ల, కాండ్రపాడు గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాల్లోని చిన్నారులకు గురువారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను తల్లిదండ్రులు అంగనవాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్కపూడి వెంకటరావమ్మ, టాటా ట్రస్ట్ ప్రతినిధి నాగలక్ష్మి, అంగనవాడీ కార్యకర్తలు రత్నమ్మ, హైమావతి, నాగమణి, సునీత, వనిత, చిన్నారులు పాల్గొన్నారు.


నందిగామలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు


మున్నలూరులో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న సూపర్‌వైజర్ కరీమాబీ

34 మంది మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 34 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 34 మందిపై 2, 4వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేశారు. 34 మందిని ఆరో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి లెనిన్ బాబు 9 మందికి ఒక్కొక్కరికి రూ. 15వేలు చొప్పున రూ.1,35,000లు, మిగిలిన 25 మందికి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున రూ. 2,50,000 మొత్తం రూ. 3,85,000 జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజూ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీలో పనిచేసే కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈనెల 15 తర్వాత చేపట్టే నిరవధిక సమ్మెకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరావు, కందుల శ్రీను తదితరులు తెలిపారు.